# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజాపక్షం/ సంగారెడ్డి : ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఎంత ముఖ్యమో యువత భవిష్యత్తుకు మాదక ద్రవ్యాల రహిత సమాజం అంతే అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,జిల్లా ఎస్పి పరితోష్ ఫంకజ్ అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ కార్యక్రమం పై ఓటర్లలో అవగాహన కల్పించడడంతో పాటు మాదక ద్రవ్యాలను నిర్మూలించాలన్న సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లెందుకు జిల్లా కలెక్టరేట్ నుంచి ఐబి గెస్ట్ హౌస్ వరకు గురువారం నిర్వహించిన 2కె రన్‌ను వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా ఖచ్చితంగా రూపొందిస్తున్నామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు కావాలని, చిరునామా మార్పులు, పేరు సవరణలు,ఇతర వివరాల నవీకరణ కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేటి నుంచి బూత్ లెవల్ అధికారులు ,ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీచేస్తారని, ప్రజలు సరైన వివరాలను అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలా గే మాదక ద్రవ్యాల దుర్వినియోగం సమాజానికి ము ఖ్యంగా యువతకు తీవ్రమైన ముప్పుగా మారుతోందని పేర్కొంటూ డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రీడలు, విద్య సృజనాత్మకత కార్యకలాపాల ద్వారా యువత తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీసు శాఖకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. మాదక ద్రవ్యాల విక్రయం ,వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. యువత చెడు అలవాట్లు భారిన పడకుండా తల్లిదండ్రులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు నో చెప్పి ఆరోగ్యవంతమైన భాధ్యతయుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ 2కె రన్‌లో అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్ పాండు రెవెన్యూ డివిజనల్ అధికారులు ,తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు ,ఉద్యోగులు, పోలీసు సిబ్బంది ,ఉపాధ్యాయులు, విద్యార్థులు యువత, సాంస్కృతిక సారథి కళాకారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నేడు 5కె రన్

ప్రజాపక్షం/నేరడిగొండః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యంటీ డ్రగ్స్ (మాదకద్రవ్యాల నివారణ) ప్రచారంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో శుక్రవారం 5కె రన్ కార్యక్రమం నిర్వహిస్తునుట్లు ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 5 గంటలకు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ 5కె రన్‌లో పాల్గొనదలచిన వారు పోలీస్ శాఖ వారు కేటాయించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికేట్ల ప్రధాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ అవగాహన పరుగులో మండలంలోని యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎస్సై ఇమ్రాన్ ఖాన్ కోరారు.

## మంచిర్యాలలో వ్యక్తి దారుణహత్య



ప్రజాపక్షం / మంచిర్యాల : మంచిర్యాల పట్టణంలోని అండాళమ్మ కాలనీ జలగుట్ట ప్రాంతంలో ఒక వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం ప్రాంతానికి చెందిన లాక్‌పతి అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హత్యకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

## ఇందిరమ్మఇల్లు గృహప్రవేశం



ప్రజాపక్షం/భీమ్‌గల్ :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన రాగి ఇందు నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయటం ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు కొత్త ఇంటిలో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరె నాగమణి స్వామి, జెజె నర్సయ్య, మాజీ చైర్మన్ కన్నె సురేందర్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగేంద్ర, మెండోరా ఉపసర్పంచ్ కుంట రమేష్, బాబాపూర్ సర్పంచ్ సమీర్, నాయకులు సుంకరి సురేష్, కత్రాజ్ శ్యాంరాజ్, వీడీసీ అధ్యక్షులు పతాని కృష్ణ, నితీష్, మహేష్, మనోజ్, అరుణ్ పాల్గొన్నారు.

## యాప్‌లో తప్పనిసరిగా ఓటరు వివరాలు నమోదు

కలెక్టర్ కె. హరిత



ప్రజాపక్షం / పెంచికలపేట్ : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, తప్పులు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. పెంచికలపేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో ఓటర్లకు ఓటర్ల గణన పత్రాల పంపిణీ ప్రక్రియను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 25 నుంచి చేపడుతున్న ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు గణన పత్రాన్ని అందించి, వెంటనే యాప్‌లో మార్క్ చేయాలని సూచించారు. పత్రాన్ని పూర్తి చేసిన అనంతరం తిరిగి సేకరించి, అందులోని వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో బూత్ స్థాయి ఏజెంట్లు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు, కుల పెద్దల సహకారాన్ని తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయడం అభినందనీయం**

**ఆసిఫాబాద్ :** జిల్లాలో చేపట్టిన యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంలో అధికారుల కృషి అభినందనీయమని కలెక్టర్ హరిత అన్నారు. రాష్ట్రంలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లు రికార్డు స్థాయిలో ఒక కోటి యాభై లక్షల మెట్రిక్ టన్నుల మేర జరిగినందున తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సన్న రకం బియ్యంతో తయారుచేసిన ఏడు రకాల పిండి వంటల కిట్లను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ యాసంగి వరి ధాన్యం, మొక్కజొన్నలు, జొన్నల కొనుగోళ్లను నిర్ణీత గడువులోగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో పౌర సరఫరాల శాఖ , సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఎన్యుమరేషన్ పత్రాలు



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్: సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మొదటిరోజు ఎన్యుమరేషన్ పత్రాలను బిఎల్ఓ సునీత అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణకు, కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సర్ ప్రక్రియలో పాల్గొనాలని సంబంధిత బిఎల్ఓలు ప్రతి ఇంటికి చేరుకొని పత్రాలను అందజేస్తారని, వాటిని పూరించి తిరిగి అధికారులకు అందజేయాలని అన్నారు. గతంలో ఇరవై ఏళ్ల క్రితం సర్ జరిగిందని, మళ్లీ జరుగుతున్న ప్రక్రియలో ప్రతి ఒక్కరు పాల్గొని ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ప్రతి ఇంటికి బిఎల్ఓలు వచ్చే విధంగా కార్పొరేటర్లు చూడాలన్నారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తు ఎన్యుమరేషన్ పత్రాలు అందరికి అందేలా చూడాలన్నారు.

## పోలీసులు వాహనాల తనిఖీ



ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేసేందుకు పోలీసులు ఎస్ఐ జె.శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. బొగ్గు గుడిసె నుండి నిజాంసాగర్ వెళ్లే రహదారిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో భాగంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లతో పాటు మొత్తం 120 వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో హెల్మెట్లు లేకపోవడం, ట్రిబుల్ రైడింగ్, నెంబర్ ప్లేటు సరిగా లేకపోవడం, సీటు బెల్టు ధరించకపోవడం, లైసెన్సు లేకపోవడం తదితర వాటిపై మొత్తం 20 కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ద్విచక్ర వాహనాలు వారు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు సీటుబెల్టు ధరించాలని ఎస్సై సూచించారు. తమతో పాటు డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్‌సి, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలు ఒరిజినల్ లేదా డిజీలాకర్, ఎం పరివాహన్ యాప్‌లో అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్సై కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించేది లేదు

భూ భారతి దరఖాస్తులను 60 రోజుల్లోగా పరిష్కరించాలి

కలెక్టర్ భవేశ్‌మిశ్రా



ప్రజా పక్షం / నిర్మల్ టౌన్ : కలెక్టరేట్‌లో అన్ని విభాగాల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల సూపరింటెండెంట్లు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన ప్రతీ సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించే ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి కింద స్వీకరించిన దరఖాస్తులను నిర్దేశిత గడువు 60 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతీ విభాగానికి సంబంధించిన రికార్డులను క్రమం తప్పకుండా పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు సక్రమంగా భద్రపర్చాలని సూచించారు. కలెక్టరేట్ ఉద్యోగుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతీ నెల సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని హెచ్చరించారు. ప్రతీ విభాగం పరిధిలోని ఉద్యోగుల వివరాలు, పెండింగ్ అంశాలపై సమగ్ర సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అం దించడ మే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య

విద్యాశాఖ కార్యదర్శికి ప్రెస్‌క్లబ్ కమిటీ వినతి



ప్రజాపక్షం/నిజామాబాద్: ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యనందించాలని జిల్లా ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడు పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుభాష్ కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారిని యోగితా రాణాకు వారు వినతి పత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడు పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుభాష్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిజాన్ని నమ్ముకుని 95 శాతం జర్నలిస్టులు వేతనాలు లేకుండానే విధులు నిర్వహిస్తున్నారన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నత విద్య కల్పించడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రై వేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించేలా కృషి చేయాలని కోరుతున్నామన్నా రు. సానుకూలంగా స్పందించిన విద్యాశాఖ కమిషనర్ యోగితారాణా సానుకూలంగా స్పందించి జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యనందించేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. జిల్లా కలెక్టర్ సంబంధిత విద్యాధికారికి ఈ విషయాన్ని తెలియజేస్తామన్నారు. కా ర్యక్రమంలో జిల్లా ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు రా జేష్, రవీందర్‌నాయక్, ఆనంద్‌పాల్, భూమేష్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నా రు.

## ప్రభుత్వ ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డు నుంచి మందులు మాయం



ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డు 1 నుంచి సిరంజీలు, ఇంజక్షన్లు ఇతర మందులు మాయమవుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఎమర్జెన్సీ వార్డులో విధులు నిర్వహిస్తున్న ఓ నర్సు బయట నుండి వచ్చిన వ్యక్తిని ముందున్న జి 8 రూమ్‌లో వెళ్లమని చెప్పటంతో అక్కడికి వెళ్లి బ్యాగ్‌లో నింపి ఇచ్చిన ఘటన గురువారం సా యంత్రం సిసి కెమెరాలో రికార్డు అయింది. గాబరగా ఆ వ్యక్తి బ్యాగ్‌లో వేసుకుని తీసుకెళ్లటం గమనార్హం. పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా అందాల్సిన మందులు ఇలా పక్కదారి పట్టడం సెక్యూరిటీ లాంటి వారు సైతం అక్కడ చూసి చూడనట్లు వదిలేయటం చూ స్తుంటే ప్రభుత్వ ధనం ఎంత దుర్వినియోగమవుతుందో ఇట్టే అర్థమవుతుంది. ఇకనైనా సంబంధిత ఆస్పత్రి అధికారులు ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండి లక్ష్యాన్ని సాధించాలి

ఎసిపి కిరణ్ కుమార్



ప్రజాపక్షం / మందమర్రి : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని బెల్లంపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. మందమర్రి పట్టణంలోని కళ్యాణిఖని సింగరేణి కాలరీస్ ఎయిడెడ్ హైస్కూల్‌లో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని ఈగల్ ఫోర్స్ గురువారం యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్, మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సిఐ రమేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా వాటి అక్రమ రవాణా సమాచా రం తెలిస్తే పోలీసులకు లేదా యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 1908కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మాదకద్రవ్యా ల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి, అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మందమర్రి సబ్ ఇన్స్పెక్టర్ నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీసు సిబ్బంది, సింగరేణి, కార్మల్, లిటిల్ ఫ్లవర్స్, శ్రీ చైతన్య, కృష్ణవేణి, మాంటిస్సోరి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## భైంసాలో వికలాంగుల బడి బాట

పాల్గొన్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి



ప్రజాపక్షం / భైంసా : భైంసా పట్టణంలో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వికాలంగుల బడిబాట 2026' కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ, వికలాంగ పిల్లలకు విద్య, వైద్యం, పునరావాస సేవలు అందించడం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారికి అవసరమైన సహాయ పరికరాలు, విద్యా అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి విద్యా వంతులను చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, మున్సిపల్ కౌన్సిలర్స్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రత్యేక పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఆర్ఎఫ్ బృందం పర్యటన



ప్రజాపక్షం / పెంబి : పెంబి మండలంలోని శెట్టిపల్లి గ్రామ పంచాయతీ పరిధి గ్రామాలలో ఎన్‌డిఆర్ఎఫ్ రెస్క్యూ బృందం పర్యటించింది. ఎన్‌డిఆర్ఎఫ్ రెస్క్యూ టీం గ్రామస్తులకు కొన్ని సూచనలు చేయడం జరిగింది. ముఖ్యంగా వర్షాకాలంలో సంభవించే అధిక వర్షాలు, వరదలు , తుఫానులు, పిడుగు, ఇతర ప్రమాదాలు జరిగి ఆస్తి నష్టం, ప్రమాదం జరగకుండా తగు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలని ఎన్‌డిఆర్ఎఫ్ రెస్క్యూ టీం గ్రామస్తులకు వివరించింది. ఇందులో ధ్రువ లక్ష్మ ణ్ ఆర్‌టిడిటీ గ్రామ సర్పంచ్‌లు విఠల్ శిడం, శశికళ శంకర్, ఆత్రం లింగు, గణేష్, పంచాయతీ కార్యదర్శి రమేష్ అంగన్వాడీ టీచర్లు రాణి, మాధవి, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / లక్షెట్టిపేట/ నస్పూర్ : ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలోని వార్డులు, రిజిస్టర్లు, ప్రయోగశాల, పరిసరాలను పరిశీలించి ఎక్కువ శాతం నమోదవుతున్న వ్యాధులు, అందిస్తున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలన్నారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెంకటరావుపేట గ్రామంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అద్దె ఆటో వివాదం...యువకుడి ప్రాణం తీసింది

తొమ్మిది మంది అరెస్ట్

వివరాలు వెల్లడించిన తూప్రాన్ డిఎస్‌పి



ప్రజాపక్షం/రామాయంపేట: చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన యాట శ్రీదర్ హత్య కేసు వెనుక అద్దె ఆటో వివాదం, ఆర్థిక లావాదేవీలు, పాతకక్షలే ప్రధాన కారణాలుగా వెలుగులోకి వచ్చాయి. హత్య కేసును ఛేదించిన పోలీసులు హత్యకు కారకులైన తొమ్మిదిమందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకేసు వివరాలను తూప్రాన్ డిఎస్‌పి నరేందర్ గౌడ్ గురువారం విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన మృతుడు యాట శ్రీదర్ (22) అదే గ్రామానికి చెందిన తుపాకుల శోభ వద్ద ఆటోను అద్దెకు తీసుకొని నడిపేవాడు. సుమారు ఏడాది క్రితం అదే ఆటోను లక్షా పదివేలు డౌన్ పేమెంట్ చెల్లించి బకాయి కిస్తీలు 19 శ్రీధర్ చెల్లించేలా శోభతో ఒప్పందం చేసుకున్నారు. అయితే 11 కిస్తీలు కట్టిన తర్వాత 19కి బదులు 22 కిస్తీలు బకాయి ఉన్నట్లు శ్రీధర్ గుర్తించి శోభను ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ వివాదంపై గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఇప్పటి వరకు శ్రీధర్ చెల్లించిన 11 కిస్తీలను ఆటో వినియోగానికి పరిహారంగా పరిగణిస్తూ శోభ తీసుకున్న లక్షా పదివేల రూపాయలు జూన్ 5 న చెల్లించాలని అప్పటి వరకు ఆటో గ్రామపెద్ద వద్ద ఉంచాలని తీర్మానించారు. అయితే కొద్ది రోజులకే శ్రీధర్ అత్యవసర పరిస్థితిలో ఆటోను బయటకు తీసి వినియోగించాడు. దీనిని గమనించిన శోభ ఆమె భర్త మహేష్, సోదరుడు ప్రభు మరికొందరితో కలిసి శ్రీధర్‌తో గొడవకు దిగి కత్తెరతో దాడి చేశారు. ఈఘటనపై చిన్నశంకరంపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం రణబోయిన ప్రభు శ్రీధర్‌కు బంధువైన యాట దర్శన్ కుమార్తె శ్రావణిని రెండవ వివాహం చేసుకున్నాడు. ఈ వివాదంలో కూడా శ్రీధర్ అమ్మాయి కుటుంబానికి మద్దతు ఇస్తున్నట్లు అనుమానించిన ప్రభు వర్గం మరింత కక్షలు పెంచుకున్నారు. పంచాయితీ ఒప్పందం ప్రకారం జూన్ 5వ తేదీన శోభ డబ్బులు చెల్లించకపోవడంతో ఈనెల 21న శ్రీధర్ అతని తండ్రి కిషన్‌లు ఆటోను తమ ఇంటికి తెచ్చుకున్నారు. ఈ క్రమంలో ప్రభు మా ఆటోను ఎలా తీసుకెళ్తావు నిన్ను చంపేస్తా అంటూ బహిరంగంగానే హెచ్చరించినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈనెల 22న సాయంత్రం శ్రీధర్ తన మేనల్లుడు మర్రికొక్కుల ప్రభాకర్‌తో కలిసి చేగుంట మండలం అన్నాసాగర్ గ్రామంలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రెండు ఆటోల్లో వచ్చిన ప్రభు అనుచరులు వెంబడించగా భయభ్రాంతులకు గురైన శ్రీధర్ బైక్‌ను ఆపకపోవడంతో అన్నాసాగర్ గ్రామ బస్టాప్ వద్దకు చేరుకోగానే ప్రభు నడుపుతున్న ఆటోతో వేగంగా బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో శ్రీధర్ గాల్లోకి ఎగిరిపడి పక్కనే ఉన్న శివాజీ విగ్రహం దిమ్మెకు గుద్దుకోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న ప్రభాకర్ గాయాలతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తల్లి శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చేగుంట పోలీసులు విచారణ చేపట్టి హత్యకు కారకులైన రణబోయిన ప్రభు, తుపాకుల శోభ, పెంద్యాల చంద్రకాంత్, తుపాకుల మహేష్, చింతల ప్రశాంత్, సాంద్రు గణేష్, రణబోయిన శ్రావణి, రణబోయిన మహేశ్వరి, చింతల సంధ్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని డిఎస్‌పి తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన రామాయంపేట సిఐ సైదా, ఎస్ఐలు చైతన్యరెడ్డి, బాలరాజు, శివానందం, రాజేశ్, సృజనలను జిల్లా ఎస్‌పి అభినందించినట్లు డిఎస్‌పి తెలిపారు. క్షణికావేశాలకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈసందర్భంగా పోలీసులు ప్రజలకు సూచించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శుక్రవారం
26-06-2026
www.prajapaksham.in


## మాదకద్రవ్యాల ఉచ్చులో పడొద్దు

### టౌన్ ఎసిపి రమణమూర్తి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** మాదకద్రవ్యాల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఖమ్మం పట్టణ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్వి.రమణమూర్తి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని దనవాయిగూడెం జిల్లా జైల్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఖైదీలకు మాదకద్రవ్యాల వాడకం వలన కలిగే నష్టాలు, దుష్పరిణామాలు, వాటి నుంచి విముక్తి పొందే మార్గాలపై అవగాహన కల్పించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత వారు ఆరోగ్యకరమైన, నేరరహిత జీవితాన్ని గడపటానికి కౌన్సిలింగ్ అవసరమన్నారు. చెడు స్నేహాల వలన, పరిస్థితుల ప్రభావంతో తాత్కాలిక ఆనందం కోసం గంజాయి వంటి మత్తు పదార్ధాలకు అలవాటుపడి బానిసలవుతే వివిధ రకాల రుగ్మతుల బారిన పడతారన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డిపిఎస్ యాక్ట్‌పై వారికి తెలియజేశారు. మాదకద్రవ్యాలు కలిగిఉండటం, సేవించడం, సరఫరా చేయడం, తయారీ, క్రయవిక్రయాలు అన్నీ క్రిమినల్ నేరాలేనని, శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలను వ్యతిరేకిస్తూ ఖైదీలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో జైలు సూపరింటిండెంట్ శ్రీధర్, ఖానాపురం హవేలీ ఇన్స్‌స్పెక్టర్ భానుప్రకాశ్, జైలర్ సక్రూ పాలొన్నారు.




## పికెఒసి 2లో కార్మికుల ఆందోళన, నిరసన

**ప్రజాపక్షం/మణుగూరు :** సింగరేణి కొంగు బంగారం మణుగూరు ఏరియాలోని పికెఒసి డిప్ సైడ్ బ్లాక్ వేలం పాటలో సింగరేణికి బేషరతుగా ఇవ్వాలని మణుగూరు ఏరియా మనుగడకు సింగరేణి కంపెనీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన పికెఒసి డిప్ సైడ్ బ్లాక్ మణుగూరు ఏరియా మనుగడకి, ఈ ఏరియాలో పనిచేస్తున్న 2400 సింగరేణి కార్మికులు, సుమారు 3,000 మంది పైగా కాంటాక్ట్ కార్మికుల భవిష్యత్ అంధకారం అవుతుందని ఆందోళన వెలిబుచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటు వారిని అనుమతించబోమని అన్నారు. కార్మికుల, మనోభావాలకు విరుద్ధంగా అనుమతిస్తే ఎంతటి త్యాగాలకైనా, పోరాటాలకైనా కార్మికులందరిని కలుపుకొని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జానకి ప్రసాద్, నాగుల సతీష్ కుమార్, రవి, రమేష్ పీకేఓసి 2 కార్మిక సోదరులందరూ పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరుతో మోసం




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉద్యోగాల కల్పన పేరుతో లక్షలాది రూపాయలు తీసుకుని ఇప్పుడు ఉద్యోగం ఇవ్వకుండా డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారని ఖమ్మం నగరానికి చెందిన సోందుమియా తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోందుమియా మాట్లాడుతూ ఖమ్మం రూరల్ మండలం దానవాయిగూడెంకు చెందిన సలీం అనే వ్యక్తి కువైట్‌లో ఉద్యోగం చేస్తున్నాడని ఆరు లక్షలు చెల్లిస్తే అబ్రాడ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఆరు లక్షలు వసూలు చేశాడని ఆయన ఇచ్చిన ఖాతాలో డబ్బులు జమ చేశామని సోందుమియా తెలిపారు. ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు కూడా ఇవ్వడం లేదని డబ్బులు అడిగితే బెదిరిస్తున్నాడని ఆయన తెలిపారు. ఈ మేరకు ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సలీంతో పాటు అతని తండ్రి ఇమామ్ కూడా ఇందుకు బాధ్యుడేనని వారిపై తగు చర్యలు తీసుకుని తమకు డబ్బులు ఇప్పించాలని సోందుమియా కోరారు. మీడియా సమావేశంలో సోందుమియా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారం కాకుంటే సమ్మె అనివార్యం : గుర్తింపు సంఘం నేతలు

### జులై 10కి వాయిదా పడిన తదుపరి చర్చలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు, పెండింగ్ డిమాండ్లు, ఉద్యోగ భద్రత, సంక్షేమ తదితర అంశాలు పరిష్కారం కాకుంటే సమ్మె అనివార్యమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో డెప్యుటీ లేబర్ కమిషనర్ డాక్టర్ శాశ్వతిరథ్ సమక్ష్యంలో 31 డిమాండ్ల పరిష్కారం కోసం కీలక చర్చలు జరికాయి. ఈనెల 8న సింగరేణి యాజమాన్యానికి సమ్మె నోటీస్ పంపిన విషయం తెలిసిందే. సమస్యలపై గుర్తింపు సంఘం, సింగరేణియ యాజమాన్యం ఇరు పక్షాలు తమ అభిప్రాయాన్ని వినిపించాయి. కార్మికుల తరుపున గుర్తింపు సంఘం నాయకులు సమస్యల తీవ్రతను, వాటి ప్రభావాన్ని వివరించారు. యాజమాన్యం కూడా తమ వైఖరిని ఈ విషయంలో స్పష్టం చేసింది. దీనిపై మరింత చర్చ అవసరమని భావించిన డెప్యూటీ లేబర్ కమీషనర్ జూలై 10కి చర్చలను వాయిదా వేశారు. ఈ చర్చల్లో గుర్తింపు సంఘం నాయకులు అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శి కే సారయ్య పాల్గొనగా, యాజమాన్యం తరుపున ఏజిఎం (ర్సనల్)అజయ్ కుమార్ హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.



## విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం

**ప్రజాపక్షం/తల్లాడ :** పాఠశాలల ముందు స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఉపకేంద్రం రహదారిలో రెండు పాఠశాలలు, ఓ జూనియర్ కళాశాల ఉన్నాయి. భాల భారతి, యూనివర్సల్ విద్యాలయం, కెఎస్‌ఎం జూనియర్ కళాశాలలో సుమారు 2వేలమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీటికి సమీపంలోని ప్రధాన రహదారిపై స్పీడ్‌బ్రేకర్స్ పెట్టకపోవడంతో వాహనదారులు అతివేగంగా ప్రయాణించడంతో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తల్లిదండ్రులు, ప్రజలు వాపోతున్నారు. ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు రహదారి దాటే సమయంలో వాహనాలు అధిక వేగంతో ప్రయాణించడంతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పాఠశాల పరిసరాల్లో చిన్నారుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యాసంస్థల ఎదుట స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### క్రిటికల్ కేర్ భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలి

### ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన మంత్రి తుమ్మల




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్యులు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను వైద్యాధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో మాట్లాడి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగికి, వారి సహాయకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించేలా చూడాలన్నారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయాలని ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆసుపత్రికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆకర్షణీయమైన మొక్కలు నాటి సంరక్షించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్ర వాతావరణం ఉండాలన్నారు. అనంతరం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా వీడియోస్ కాలనీలో కొనసాగుతున్న ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఇంటింటి సర్వే వివరాల నమోదు తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, వేగవంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ తనిఖీల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, ముదిగొండ సొసైటీ ఛైర్మన్ తుపాకుల యలగొండ స్వామి, వైద్యాధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.




## పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి

### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తెలిపారు. ఖమ్మం గిరి ప్రసాద్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య, ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం జిల్లా కార్యదర్శి బానోత్ జగన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మౌలానా మాట్లాడుతూ గిరిజనులు, బడుగుబలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు మెరుగైన హాస్టల్ వసతులు కల్పించడంతోపాటు తండాలు, గూడెల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. పోడు భూముల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుని వెంటనే గిరిజనులకు పోడు పట్టాలు మంజూరు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ చెవేళ్ల డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బానోత్ రాంకోటి, బోడా వీరన్న, బానోత్ రాంబాబు, బానోత్ రామ్మూర్తి, భూక్యా నర్సింహా, బోడా చీనా తదితరులు పాల్గొన్నారు.

# ‘సర్’ సమర్థవంతంగా నిర్వహణ

### ఎన్యూమరేషన్ ఫారంను బిఎల్‌ఒకు అందించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే ఇంటింటా ఎన్యూమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని, దానిని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 46వ డివిజన్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బిఎల్‌వో కలెక్టర్‌కు వ్యక్తిగత ఎన్యూమరేషన్ ఫారం అందజేశారు. అనంతరం కలెక్టర్ స్వయంగా ఫారంలో వివరాలను నమోదు చేసి అధికారులకు తిరిగి సమర్పించారు. ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణ ఫారముల పంపిణీ, సేకరణ విధానాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హత గల ఓటరును గుర్తించి వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఒ) ఎన్నికల సంఘానికి క్షేత్ర స్థాయి ప్రతినిధులుగా వ్యవహరిస్తారని వారి పనితీరు పైనే ఈ కార్యక్రమ విజయవంతం ఆధారపడి ఉంటుందన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటరును కలిసే సమయంలో ప్రజలకు తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో మొదటి నాలుగైదు రోజుల లోపు ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయాలని సూచించారు వాటిని పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. తదుపరి సందర్శనలో వాటిని సేకరిస్తామని స్పష్టం చేయాలన్నారు. ఫారం సమర్పించని పక్షంలో సంబంధిత వ్యక్తుల పేర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో కనిపించవని ప్రజలకు వివరించాలని తెలిపారు. నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు లేదా ఫారములు స్వయంగా నింపలేని వారికి బిఎల్‌వోలు పూర్తి సహకారం అందించాలన్నారు.

ఇంట్లో లేని సందర్భాల్లో కనీసం మూడుసార్లు సందర్శించి ఫారములు అందించే ప్రయత్నం చేయాలన్నారు. ఫారం పంపిణీ జరిగినట్లు రశీదు లేదా ఇతర ఆధారాలు భద్రపర్చుకోవాలని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో ఇప్పటికే పేరు ఉన్న అర్హులైన ఓటర్ల నుంచి ఈ దశలో ఎలాంటి సహాయక పత్రాలు తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

ప్రస్తుతం అమలులో ఉన్న ఓటరు జాబితాను 2002 జాబితాతో మ్యాపింగ్ చేసి వివరాలు ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందన్నారు. జూలై 31న ప్రచురించే జాబితాలో ఎన్యూమరేషన్ ఫారములు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉంటాయని ఇవ్వని వారి పేర్లు జాబితాలో కనిపించకపోవచ్చునని తెలిపారు. నివాసం మారిన వారు, అద్దె ఇండ్లలో నివసిస్తున్న వారు, కొత్తగా వచ్చిన నివాసితుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో ఓటర్లుగా ఉన్న వారిని ఫారం ఎనిమిది ద్వారా బదిలీ చేయించే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఆర్‌వోలు, బిఎల్‌ఒలు, బిఎల్‌ఎలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## ‘సర్’ కార్యక్రమంపై బిఎల్‌ఒలకు అవగాహన

### ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు బూత్ లెవల్ అధికారులకు (బిఎల్ఒ) పూర్తి స్థాయి అవగాహన అవసరమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పేర్కొన్నారు. సత్తుపల్లి పట్టణ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమంపై బిఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమం గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి బిఎల్‌ఒకి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.

ముఖ్యంగా మ్యాపింగ్ ఫారమ్‌లను నింపే విషయంలో అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 30న నిర్వహించనున్న ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తరఫున బిఎల్‌ఓలు పాటించాల్సిన విధివిధానాలు, బాధ్యతలపై వివరించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, ఎఎంసి చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, మండల, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

## ప్రతీ ఓటరూ సహకరించాలి

### సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట

**ప్రజాపక్షం/భద్రాచలం :** పారదర్శక ఓటరు జాబితా తయారీకి ప్రతీ ఒక్క ఓటరూ సహకరించాలని సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట అన్నారు. గురువారం పట్టణంలోని అయ్యప్ప కాలనీలో గల 158వ పోలింగ్ బూత్ పరిధిలో ఇంటింటికీ తిరిగి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందజేసిన ఫారాలను పూరించి బిఎల్‌ఓలకు అందించి రశీదు తీసుకోవాలని సూచించారు. బిఎల్‌ఒలు, బిఎల్‌ఎలు ప్రతీ ఇంటికి తిరిగి ఫారాలు అందజేస్తారని, ఆ సమయంలో ఇంటి యజమాని కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయడంతో పాటు అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఫారాలు పూరించే సమయంలో ఓటర్లు తమ ఓటర్ ఐడి కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అవసరమైతే జనన ధృవీకరణ పత్రం, పదో తరగతి మెమో, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, రేషన్ కార్డు, విద్యుత్ బల్లు వంటివి, భూమి పత్రాలు, ప్రభుత్వ ఉద్యోగులు వారి ఐడి, పెన్షన్, పేమెంట్ ఆర్డర్ వంటి పత్రాలు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలు సమగ్రంగా ఉన్నాయో లేదో తెలుసుకుని నిర్ధారించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయాబ్ తహశిల్దార్ వినయశీల, శ్రీరామ్, బిఎల్‌ఓ రమేష్, సూపర్వైజర్ కీర్తి పాల్గొన్నారు.

## ఉత్తమ హాజరుతో రాష్ట్ర స్థాయి ప్రశంసలు



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచిలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. గత విద్యా సంవత్సరంలో అత్యుత్తమ హాజరు నమోదు చేసి విద్యా నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులు, సిబ్బందికి స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ ప్రశంసా పత్రాలు పంపించి అభినందించారు.

విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు పాఠశాల నిర్వహణలో నిబద్ధతతో పని చేస్తూ 90శాతానికి పైగా హాజరు నమోదు చేసిన స్పెషల్ ఆఫీసర్ శివారపు అజితకుమారి, పిజి సిఆర్‌టిలైన జయసుధాంధిని(ఎకనామిక్స్), పూనుగుపాటి పద్మజ(సివిక్స్), సిఆర్‌టీలైన రాజకుమారి(ఇంగ్లీష్), ఉష ( ఫిజికల్ సైన్స్), పిఇటి రాయల స్వామి, అకౌంటెంట్ గండికోట కృష్ణవేణిలకు ప్రశంసా పత్రాలు అందాయి. అలాగే విద్యార్థుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్న వార్డెన్లు వసంత, నాగమణి, వెంకటరమణ, శాంతమ్మలకు కూడా రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది.

## సిపిఐ సానుభూతిపరురాలు నాగరత్తమ్మ మృతి



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఈర్లపుడి గ్రామానికి చెందిన సిపిఐ సానుభూతిపరురాలు కురువెళ్ల నాగరత్తమ్మ (82) గురువారం మృతిచెందారు. ఆమె మృతిపట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సంతాపం వ్యక్తం చేశారు. ఈర్లపుడిలో వారి స్వగృహంలో ఉంచిన రత్తమ్మ మృతదేహాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రత్తమ్మ భర్త ఆనందరావు రజబ్‌అలీ అనుచరునిగా గుర్తింపు పొందారని ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆనందరావు గతంలోనే మృతిచెందారన్నారు. ఆయన మృతి తర్వాత కూడా వారి కుటుంబం పార్టీ కోసం పనిచేశారన్నారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని సురేష్ తెలిపారు. రత్తమ్మకు ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కురువెళ్ల వెంకయ్యతో పాటు పలువురు నాయకులు రత్తమ్మకు నివాళులర్పించారు.

## యాతాలకుంట టన్నెల్ పనుల పరిశీలన

### ఆగష్టు నాటికి పనులు పూర్తిచేయాలని ఆదేశం

### ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్‌లు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మండల పరిధిలోని యాతాలకుంట వద్ద నిర్మాణంలో ఉన్న టన్నెల్ పనులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గురువారం సంయుక్తంగా పరిశీలించారు. టన్నెల్ నిర్మాణ పురోగతి, నాణ్యత, భద్రతా ప్రమాణాల అమలు, నిర్మాణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల స్థలాన్ని సందర్శించిన కలెక్టర్లు ప్రస్తుతం పూర్తయిన పనులు, మిగిలిన పనులు, నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, పనుల వేగం, ఎదురవుతున్న సమస్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ టన్నెల్ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి ఆగస్టు నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు, ఇంజినీరింగ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. టన్నెల్ నిర్మాణానికి సంబంధించిన భద్రతా చర్యలు, మార్జిన్ సేఫ్టీ అంశాలను నిరంతరం పరిశీలించాలని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా నాణ్యమైన నిర్మాణాన్ని అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లు అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ శాఖ టన్నెల్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరిక్షిత్ మెహ్రా, చీఫ్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. కృష్ణతో పాటు సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెంచిన ధరలు తగ్గించాలి : సలాం



**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిత్యావసర వస్తువుల ధరలను పెంచాయని మారిన పరిస్థితుల నేపథ్యంలో పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. 52వ డివిజన్‌లో గురువారం జరిగిన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సలాం మాట్లాడుతూ యుద్ధం ముగిసిన తర్వాత క్రూడాయిల్ ధరలు తగ్గాయని పెట్రోల్, డీజిల్ ధరలను కూడా తగ్గించాలన్నారు. మోడీ పాలనలో సామాన్యులు బతికే పరిస్థితి లేదని, పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఒక పక్క పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, మరో పక్క నిరుద్యోగం దేశానికి ప్రమాదకరంగా మారాయన్నారు. మత ఉన్మాదాన్ని బిజెపి రెచ్చగొడుతుందని ఇది దేశ ఐక్యతను దెబ్బ తీస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంబశివ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఎస్‌కె సైదా, జ్వాలా నర్సింహారావు, నాయకులు చానా, రెహ్మాన్ పాల్గొన్నారు.

